# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పునఃప్రారంభించారు.**
2. **రాష్ట్రంలో యువత ప్రతిభకు పట్టం కట్టే అంతర్జాతీయ డ్రోన్ సదస్సుకు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి.**
3. **మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 22 వ తేదీన అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.**
4. **ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 23వ తేదీన మంత్రివర్గ సమావేశం జరగనున్నది.**
5. **బాల్య వివాహాల నిరోధానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక అధికారులను నియమించాలని రాష్ట్రాలకు సుప్రీం కోర్టు సూచించింది.**

==========================

అమరావతి ప్రాంతంలోని తుళ్ళూరు మండలం ఉద్దండ రాయుని పాలెం వద్ద ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ భవన ప్రాంగణంలో ఆయన పూజా కార్యక్రమం నిర్వహించి నిర్మాణ పనులకు తిరిగి శ్రీకారం చుట్టారు. 160 కోట్ల రూపాయల వ్యయంతో గతంలో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో ఏడంతస్తులలో ఈ కార్యాలయ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు మాట్లాడుతూ ... అమరావతి రాజధాని నిర్మాణ కల సాకారం కానున్నదని చెప్పారు. ఆర్థిక ..., వాణిజ్య ..., సాంస్కృతిక కార్యకలాపాలకు అమరావతి కేంద్ర బిందువు అవుతుందని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ ....

... వాయిస్....38 సెకన్లు....

---

వివిధ రంగాలకు సాంకేతికంగా గణనీయమైన సేవలు అందించే డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో అమరావతిలో ఈ నెల 22 ..., 23 తేదీలలో జరగనున్న అంతర్జాతీయ డ్రోన్ సదస్సుకు చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని యువత తమ ప్రతిభా పాటవాలను చాటి చెప్పేందుకు

ఈ డ్రోన్ సదస్సు ఎంతైనా దోహదపడుతుంది. డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం ..., ఆవిష్కరణలలో రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలబెట్టడమే ఈ డ్రోన్ సదస్సు నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

డ్రోన్ సదస్సు ఏర్పాట్లపై ఆకాశవాణి విజయవాడ ప్రతినిధి కె. నవీన్ కుమార్ మరిన్ని వివరాలు తెలియజేస్తారు.....

..వాయిస్...36 సెకన్లు....

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 22 వ తేదీ నుండి రెండు రోజుల పాటు రష్యాలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన బ్రెజిల్ ..., రష్యా ...., భారత్ ...., చైనా ..., దక్షిణాఫ్రికా దేశాలు సభ్యులుగా ఉన్న ....బ్రిక్స్.... శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. కజన్ నగర వేదికగా జరిగే 16 వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనాలని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ అందజేసిన ఆహ్వానం మేరకు నరేంద్రమోడీ రష్యాలో పర్యటిస్తారని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో భాగంగా సభ్య దేశాల అధినేతలతో నరేంద్రమోడీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

---------------------------

రానున్న రెండు ... మూడు రోజులలో తమిళనాడు ...., పుదుచ్చేరి ..., కర్నాటక రాష్ట్రాలతో సహా దక్షిణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ....ఐఎండి. తెలిపింది.

ఆది ..., సోమవారాలలో అండమాన్, నికోబార్ దీవులలో కూడా ఇటువంటి పరిస్థితి ఉంటుందని ఐఎండి పేర్కొంది. కాగా ... ఉత్తర అండమాన్ సముద్రంలో తాజాగా అల్పపీడన ద్రోణి ఏర్పడు తుందని ..., దీని ప్రభావంతో ఈ నెల 22వ తేదీన మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో ఈ నెల 23వ తేదీ ఉదయం రాష్ట్రమంత్రి వర్గ సమావేశం జరుగుతుంది. మంత్రి వర్గ సమావేశంలో తీసుకోవలసిన నిర్ణయాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 21 వ తేదీ సాయంత్రం లోపు పంపించాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ..., ముఖ్య కార్యదర్శులు ....., కార్యదర్శులను ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు..

---------------------------

దేశంలో బాల్య వివాహాల నిరోధానికి ప్రతి జిల్లాలో బాల్య వివాహాల నిషేధ అధికారులను ప్రత్యేకంగా నియమించాలని రాష్ట్రాలకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. బాల్య వివాహాల సామాజిక రుగ్మతను రూపుమాపేందుకు బహుముఖ కార్యాచరణ చేపట్టడం అవసరమని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బాల్య వివాహాల నిరోధానికి సంబంధించి పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందు కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించి .... ఆ అధికారిని ఆ ఒక్క బాధ్యతకే వినియోగించాలని .... ఇతర విధులను అప్పగించరాదని సూచించింది. అంతే కాకుండా ...

బాల్య వివాహాల నిషేధం అమలు క్రతువులో జిల్లాల కలెక్టర్లు ...., పోలీసు సూపరింటెండెంట్‌లను భాగస్వాములను చేయాలని కూడా సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 22వ తేదీ నుండి ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గ్రామ ..., వార్డు సచివాలయాలు ..., కళాశాలలు ...., పాఠశాలలు ...., అంగన్వాడీ కేంద్రాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తారు. ఇందు కోసం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ...., పురపాలక సంఘాల కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ శిబిరాలలో కొత్తగా ఆధార్ కార్డు నమోదు ..., బయో మెట్రిక్ ...., డెమోగ్రాఫిక్ ను తాజాగా నమోదు చేయడం ..., ఈ – ఆధార్ వంటి సేవలను అందిస్తారు.

---------------------------

ప్రకృతి వైపరీత్యాలకు గురైన వారందరికీ అవసరమైన సహాయం అందించడానికి ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవా ప్రాధికార సంస్థ అన్నివేళలా ముందుంటుందని ఆ సంస్థ సభ్య కార్యదర్శి జస్టిస్ బబిత తెలిపారు.

విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతమైన వాంబే కాలనీలో ఎన్.టి.ఆర్. జిల్లా వైద్య శాఖ ..., మరియు తమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఈరోజు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ బబిత మాట్లాడుతూ .... వైద్య శిబిరాలలో ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందని ...., తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చునని అన్నారు.

---------------------------

నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం .... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తడ వద్ద తీరం దాటి బలహీనపడినప్పటికీ కోస్తాంధ్ర ...., రాయలసీమ జిల్లాలపై దాని ప్రభావం ఇంకా కొనసాగుతోంది. పలు జిల్లాలలో ఎండ వాతావరణం నెలకొనగా ..., మరికొన్ని జిల్లాలలో భారీ వర్షం కురుస్తోంది. ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ ..., ఒంగోలు ..., మార్కాపురం ..., గిద్దలూరు ...., వై.ఎస్.ఆర్. జిల్లాలోని ప్రొద్దుటూరు .., మైదుకూరు ...., కడప ...., నెల్లూరు జిల్లాలోని వింజమూరు ..., కావలి ..., కోవూరు ...., తూర్పుగోదావరి జిల్లా అల్లవరం ..., అయినవల్లి ..., ముమ్మిడివరం తదితర ప్రాంతాలలో వర్షం కురుస్తోంది

---------------------------

ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రంలోని వివిధ జలాశయాలు జలకళ సంతరించుకుంటున్నాయి. తుంగభద్రా ..., శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ... అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

తుంగభద్రా జలాశయం నుండి పది గేట్ల ద్వారా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. దీని పూర్తి స్థాయీ నీటి మట్టం 1633 అడుగులు కాగా ....ప్రస్తుతం 1631 అడుగుల వద్ద ఉండి.

మరొక వైపు .... శ్రీశైలం జలాశయానికి కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీని పూర్తి స్థాయీ నీటి మట్టం 885 అడుగులు కాగా ...ప్రస్తుతం 884 అడుగుల వద్ద ఉంది. ఇక్కడ అధికారులు ఒక గేటును ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు..

---------------------------

ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలతో నాగార్జునసాగర్ జలాశయానికి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ... నాగార్జున సాగర్ జలాశయానికి చెందిన ఆరు గేట్లను అధికారులు పైకి ఎత్తి 64 వేలకు పైగా క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు.

---------------------------

రాష్ట్రంలో సరైన నిర్వహణ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠశాలలకు వంద కోట్ల రూపాయల మేర నిధులు విడుదల చేయాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. రెండు మూడు రోజులలో ఈ నిధులు పాఠశాలల ఖాతాలలో జమ కానున్నాయి. 2024 -25 విద్యా సంవత్సరం పద్దు కింద ఈ మొత్తాన్ని విడుదల చేస్తారు.

---------------------------

రాష్ట్రంలోని రాజమహేంద్రవరం ..., విశాఖపట్నం సెంట్రల్ జైళ్ళు ..., రేపల్లె ...., దర్శి సబ్ జైళ్లు ...., కడప పట్టణంలోని మహిళా జైళ్లలో కొత్త భవనాల నిర్మాణం ..., విస్తరణ ...., అత్యాధునిక సాంకేతిక ..., భద్రత పరికరాల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం 101.16 కోట్ల రూపాయల మేర నిధులను కేటాయించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ నిధులు కేటాయిస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు..

======================